ట్రాఫిక్ హోంగార్డుకు అండగా నిలిచిన ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

లాలాపేట: నల్లకుంట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న ఎం. శ్రీనివాసులు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. బోడుప్పల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్సపొందుతున్నారు. దీంతో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఏఎస్సై వెంకటేశ్వర్‌రావు తదితరులు గురువారం హాస్పిటల్‌కు వెళ్లి శ్రీనివాసులును పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం హోంగార్డు శ్రీనివాసును కిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించి ఆర్థిక సాయం అందజేశారు.

నేడు మహారుద్ర యాగం

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని తిరుపాదమండపంలో మహా రుద్రయాగం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్‌బోర్డు అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు, ఈఓ రాజేష్‌కుమార్‌లు తెలిపారు. ఈనెల 8వ తేది శుక్రవారం నుంచి 10వ తేది వరకు రెండు రోజుల పాటు మహారుద్రయాగం, మహాన్యసం ఏకాదశ రుద్రపారాయణం, అభిషేకం, రుద్ర క్రమార్చన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టామని వివరించారు.

క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించాలి



క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఎన్టీపీసీ అధికారులు

బన్సీలాల్‌పేట్: విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సహించాలని ఎన్టీపీసీ జీఎం పాణిగ్రాహి అన్నారు. కవాడిగూడ ప్రధాన రహదారిలోని ఎన్టీపీసీ ప్రధాన కార్యాలయంలో గురువారం క్రీడాకారుల ఫ్యాబ్రిక్ క్యాబిన్‌ను అందజేశారు. సీఎస్ఆర్ కార్యక్రమం ద్వారా స్పోర్ట్స్ కోచింగ్ ఫౌండేషన్ స్వచ్ఛంధ సంస్థకు ఈ క్యాబిన్‌ను అందజేశారు. విద్యార్థుల్లోని ప్రతిభ పాటవాలను వెలికితీయడానికి క్రీడలు ఎంతో దోహపడుతాయన్నారు. రిటైర్డ్ ఉన్నతాధికారి ప్రవీణ్‌కుమార్, ఎన్టీపీసీ ప్రియాంక పాల్గొన్నారు.

రత్న విజయ్‌కు ఓయూ డాక్టరేట్



కంతి రత్నవిజయ్

లాలాపేట: సికింద్రాబాద్ నార్త్ లాలాగూడకు చెందిన హైకోర్టు న్యాయవాది కంతి రత్నవిజయ్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ జయకుమార్ పర్యవేక్షణలో 'భూ సేకరణ చట్టం' అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకుగాను యూనివర్సిటీ రత్న విజయ్‌కి డాక్టరేట్‌ను ప్రకటించింది.

నేడు యాగాలు, అన్నదానాలు

రసూల్‌పురా: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నేడు (శుక్రవారం) కంటోన్మెంట్ నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన కార్ఖాన మహంకాళీ ఆలయంలో వంద మంది పురోహితులతో యాగాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. గురువారం బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, స్థానిక కాంగ్రెస్ నేతలతో కలసి యాగాల ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయం ఆవరణలో లక్ష్మి గణపతి యాగం, మృత్యంజయ యాగం, నవచండియాగం, శతరుద్ర యాగాలను నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఎప్పటికప్పుడు సమస్యల్ని పరిష్కరిస్తా

బౌద్ధనగర్: డివిజన్‌లో ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. డివిజన్‌లోని ఎస్‌బిహెచ్ పార్క్ వద్ద గురువారం పవర్‌బోర్ పనులు కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికంగా నెలకొని ఉన్న సమస్యలను ప్రజలు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, కంది నారాయణ, రాజేష్, జగన్, మల్లేష, క్రాంతి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభించిన డీసీపీ

రాంగోపాల్‌పేట్: నేరాల నియంత్రణ, నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు. గురువారం పాట్‌మార్కెట్‌లో పాట్ మార్కెట్ జువెలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 48 కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన సీసీ కెమెరాలతో రాత్రి వేళల్లో జరిగే నేరాలను సైతం గుర్తించి నేరగాళ్లను పట్టుకోవచ్చన్నారు. మహంకాళి ఏసీపీ సర్దార్‌సింగ్, మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్ షర్మల్ జైన్ పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ రెన్యువల్ కోసం వచ్చిన వృద్ధుడి గొలుసు చోరీ

అమీర్‌పేట: పాస్ పోర్ట్ రెన్యువల్ కోసం వచ్చిన ఓ వృద్ధుడి మెడలోని బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..మియాపూర్‌లో ఉంటున్న హెచ్ఏఎల్ కంపెనీ రిటైర్ ఉద్యోగి వెంకట సుబ్బారావు గత నెల 29న అమీర్‌పేట పాస్‌పోర్ట్ రెన్యువల్ చేయించుకునేందుకు ఆదిత్య ట్రేడ్ సెంటర్‌లోని పాస్ పోర్ట్ కార్యాలయానికి వచ్చాడు. పని ముగించుకుని బయటికి వచ్చి చూసుకోగా తన మెడలో ఉన్న 16 గ్రాముల బంగారు గొలుసు కనిపించ లేదు. దీంతో మనస్తాపానికి లోనైన ఆయన గురువారం ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మా లక్ష్యం.. సమస్యల పరిష్కారం

ప్రజలకు అందుబాటులో రెవెన్యూ సేవలు

- ప్రభుత్వ భూముల పరిరక్షణకు గట్టి చర్యలు
- సాక్షితో సికింద్రాబాద్ నూతన ఆర్డీఓ సాయిరామ్





పి. సాయిరామ్, సికింద్రాబాద్ ఆర్డీఓ

బన్సీలాల్‌పేట్: "రెవెన్యూ సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచడంతోపాటు సమస్యల పరిష్కారానికి సకాలంలో చర్యలు తీసుకుంటా.. ప్రభుత్వం పేదల ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల విషయంలో నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతాం" అని సికింద్రాబాద్ నూతన ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన పి.సాయిరామ్ చెప్పారు. ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన సాయిరామ్ సాక్షితో పలు విషయాలను వెల్లడించారు. రెవెన్యూ పరమైన సేవల విషయంలో ఎలాంటి సమస్యలున్నా ప్రజలు నేరుగా తనను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

సకాలంలో సర్టిఫికెట్లు అందజేస్తాం

సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో సికింద్రాబాద్, మారేడ్‌పల్లి, తిరుమలగిరి, అమీర్‌పేట్, షేక్‌పేట్, ఖైరతాబాద్, ముషీరాబాద్ మండలాలున్నాయి. పేదలకు పెన్షన్లు, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలతో పాటు ఇళ్ల పట్టాల పంపిణీ అలాట్‌మెంట్ కూడా చేస్తున్నాము. ప్రజలకు కావలసిన కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందజేస్తున్నాము. అలాగే అర్హులైన పేదలకు సకాలంలో పెన్షన్లు అందజేస్తున్నాము. సికింద్రాబాద్ రెవెన్యూ పరిధిలో మొత్తం 6,624 మంది పెన్షన్ దారులు ఉన్నారు.వీరితోపాటు అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్న వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పెన్షన్లు అందజేస్తున్నాము.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాము. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ)లు ప్రతి వారం ప్రభుత్వ స్థలాన్ని తనిఖీ చేసి కబ్జాకాకుండా తీసుకుంటున్న చర్యలను ఎప్పకప్పుడు తెలియజేస్తారు. సికింద్రాబాద్ రెవెన్యూ పరిధిలో లక్షా 44వేల చదరపు మీటర్ల ప్రభుత్వ భూమి ఉంది. ప్రభుత్వ భూములను గుర్తించి స్థలం చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి అక్కడ బోర్డులను ఏర్పాటు చేశాము. ప్రభుత్వ భూములను అక్రమించే వారిపై కఠినంగా వ్యవహారిస్తున్నాము. కేసుల్లో ఉన్న భూములపై న్యాయపోరాటం చేస్తూ వాటిని స్వాధీనం చేసుకుంటున్నాము.

సీనియర్ సిటిజన్స్‌ను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటాం

సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటాము. కన్న పిల్లలు వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తూ వారి బాగోగులు పట్టించుకోకుంటే సదరు వ్యక్తులపై చట్టపరమైనచర్యలు తీసుకుంటాము. చట్టపరంగా సీనియర్ సిటిజన్స్‌కు అనేక హక్కులుంటాయి. వారి ఆస్తిని బలవంతంగా తీసుకున్నా, సంతకాలను ఫోర్జరీ చేసినా చర్యలు తప్పవన్నారు. సీనియర్ సిటీజన్స్ దరఖాస్తు చేసిన వెంటనే చట్టపరిధిలో న్యాయంచేస్తున్నాము. కన్న తల్లిదండ్రులను పట్టించుకోకుండా ఉండే పిల్లల నుంచి వారికి ప్రతి నెలా మెంటినెన్స్ కోసం రూ. 10వేల ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాము.

ఎప్పటికప్పుడు ఫైల్స్ క్లియర్ చేస్తాం

ప్రజల నుంచి వచ్చే రెవెన్యూ పరమైన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాము. సమయ పాలన అంటూ లేకుండా ఫిర్యాదులను స్వీకరిస్తున్నాము. రెవెన్యూ సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాము. టేబుల్‌పై ఒక్క ఫైల్ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నాం.

దళారీ వ్యవస్థకు చెక్

రెవెన్యూ పరమైన సేవల్లో దళారీ వ్యవస్థకు తావు లేకుండా చర్యలు తీసుకుంటాము. ప్రజలు నేరుగా వచ్చి ఆయా పథకాలు, సేవల కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే పరిష్కారిస్తాము. దళారుల మాయమాటలు నమ్మి వారికి డబ్బులు చెల్లించి ప్రజలు మోస పోరాదు. నేరుగా అధికారుల వద్దకు వచ్చి పనులు చేయించుకోవాలని సూచన.

వరదనీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు పరిశీలన



వరదనీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న దృశ్యం కార్పొరేటర్

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ సుభాష్‌చంద్రబోస్‌నగర్ నుంచి జోషి కాంపౌండ్ వరకు చేపట్టిన వరదనీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను జలమండలి, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ సామల హేమ గురువారం పరిశీలించారు. ప్రధాన రహదారిని క్రాస్ చేస్తు నిర్మాణ పనులు చేపట్టే సమయంలో అన్ని విభాగాలు సమన్వయంతో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా నిర్మాణపనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, జలమండలి మేనేజర్ ప్రభు, జీహెచ్ఎంసీ ఏఈ కౌషిక్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరాలి



ప్రొఫెసర్ వి.రామ్‌గోపాల్‌రావును సత్కరిస్తున్న దృశ్యం

లాలాపేట: మనం చేస్తున్న పరిశోధనలు(రీసెర్చ్) లైబ్రరీలో మొదలై, లైబ్రరీలోనే అంతం అవుతున్నాయని ఆలా కాకుండా ఆ పరిశోధనా ఫలాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు చేరాలని బిట్స్ పిలానీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి. రామ్‌గోపాల్ రావు అన్నారు. గురువారం ఐఐసీటీ ఆడిటోరియంలో తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్(టీఏఎస్) ఆధ్వర్యంలో డా. వై . నాయుడమ్మ మెమోరియల్ లెక్చర్ జరిగింది. వీసీ కీలక ప్రసంగం చేశారు. దేశంలో టెక్నాలజీ డెవలప్‌మెంట్‌కు దోహదపడుతున్న ముఖ్యమైన అంశాలను వివరించారు. లైబ్రరీలో నుంచి కాకుండా సంఘం నుంచి, పరిశ్రమల నుంచి సమస్యలను గుర్తించి వాటికి పరిశోధనల ద్వారా పరిష్కార మార్గాలను చూపించాలనీ అభిప్రాయపడ్డారు. ఆవ్రా లాబరేటరీస్ చైర్మెన్ డా. ఏ. వి. రామారావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లక్ష్మిబాల్‌రెడ్డి

అమీర్‌పేట: ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరముందని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మిబాల్‌రెడ్డి అన్నారు.డివిజన్‌లోని ఎస్ఆర్‌టీ కాలనీ నుండి జైభారతి స్కూలు చౌరస్తావరకు రూ.47 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు సందీప్,బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి,సీనియర్ నాయకులు మిర్జా అలీబే పాల్గొన్నారు.

ఘనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ దినోత్సవం



స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం సికింద్రాబాద్ ఎస్పీరోడ్‌లోని స్కౌట్స్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ ఈఓ శ్రీధర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన తనకు స్కౌట్స్ ఎన్నో అనుభవాలను నేర్పిందని పేర్కొన్నారు. చీఫ్ కమిషనర్ జీవి దేవదత్, అధ్యక్షులు మాధవరావు, కార్యదర్శి రమేష్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: డివిజన్ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి వెనువెంటనే చర్యలు తీసుకుంటామని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. ఎస్సార్టీకాలనీ నుంచి జైభారతి స్కూల్ చౌరస్తా వరకు రూ.47 లక్షల వ్యయంతో వేయనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆమె ప్రారంభించారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: మైత్రీవనం సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆర్ఎస్ బ్రదర్స్, కాకతీయ మెస్, అమీర్‌పేట మెయిన్‌రోడ్డు, దుర్గానగర్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సోనాబాయి టెంపుల్, సత్యం థియేటర్, స్పెన్సర్ బిల్డింగ్, ప్లే గ్రౌండ్ ఏరియా, శీష్‌మహల్ థియేటర్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

వసతుల కల్పనకు కృషి

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఎమ్మెల్యే అభివృద్ధి నిధులు వెచ్చించి మౌళికవసతులు కల్పించనున్నట్లు ఎమ్మెల్యే శ్రీగణేష్ హామీచ్చారు. గురువారం తిరుమలగిరి లాల్‌బజార్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందిని, ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం లో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్ అవగాహన కార్యక్రమంలో...

శ్రీనిధి ఎడ్యుకేషనల్ గ్రూప్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ తెలంగాణ 2టీ బెటాలియన్ సికింద్రాబాద్ గ్రూప్ గురువారం నిర్వహించిన క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు.

రేపు అభిషేకం, అర్చన

సనత్‌నగర్: సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసంలో ఈ నెల 9వ తేదీన 'చిన్న పిల్లలచే పార్థివలింగ అభిషేకం, అర్చన' కార్యక్రమం నిర్వహించనున్నారు. విశేషం కలిగిన పార్థివ లింగాభిషేకం, అర్చనను అతి పవిత్రమైన కార్తీక మాసంలో, ప్రమథ గణాలతో శివపార్వతులు భూసంచారం చేసే ప్రదోష సమయం సాయంత్రం 5 గంటలకు మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 108 మంది చిన్న పిల్లలతో ఈ విశేష కార్యక్రమాన్ని నిర్వహించాలని సంకల్పించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు పిల్లల పేరు, వారి తండ్రి పేరు, మొబైల్ నెంబర్ 87907 64019కు వాట్సప్‌కు పంపించాలని సూచించారు.

ప్రత్యేక పూజలు.. పాలాభిషేకం

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన శ్రీ స్కందగిరి సుబ్రమణ్యం స్వామి దేవాలయంలో గురువారం కావడి ఫాల్కుడి కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది భక్తులు దేవాలయంలో జరిగిన ఉత్సవంలో పాల్గొన్నారు. పాల బిందెతో అనేక మంది దేవాలయం చుట్టూ తిరిగి ప్రదక్షిణలు చేశారు. అనంతరం దేవాలయంలో స్వామికి పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.